క్లుప్తంగా...

బలగం రచ్చరవికి సన్మానం



రచ్చరవిని సన్మానిస్తున్న శ్రీనివాస్‌గౌడ్ తదితరులు

శంషాబాద్: 'బలగం' చిత్ర నటుడు రచ్చరవి సోమవారం శంషాబాద్ పట్టణంలోని తన పాత గురువులను కలిసేందుకు వచ్చాడు. ఈ సందర్భంగా ఆయనను మధురానగర్ కాలనీ టాప్ బేకరి నిర్వాహకుడు శ్రీనివాస్‌గౌడ్ సన్మానించారు. ఈ సందర్భంగా రచ్చరవి మాట్లాడుతూ.. బలగం చిత్రంలో తాను నటించినందుకు సంతోషంగా ఉందన్నారు. కార్యక్రమంలో గోపాల్, శ్రీనివాస్, యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

ఐదు శాతం రాయితీతో ఆస్తిపన్ను చెల్లించండి



కమిషనర్ వేణుగోపాల్‌రెడ్డి

బండ్లగూడ: ప్రజలు ఆస్తిపన్నును సకాలంలో చెల్లించాలని బండ్లగూడ జాగీరు మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ వేణుగోపాల్‌రెడ్డి అన్నారు. ఈ మేరకు సోమవారం కార్పొరేషన్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ ప్రస్తుతం 2023–24 సంవత్సరానికి గాను ఆస్తిపన్ను చెల్లింపుదారులకు 5 శాతం రామయితీని అందిస్తున్నట్లు తెలిపారు. ఈ అవకాశం ఐదు రోజులు మాత్రమే ఉంటుందన్నారు. 2023–24 ఆర్థిక సంవత్సరానికి ఐదు శాతం రాయితీ ద్వారా రూ.3.81 కోట్లు వసూలైనట్లు తెలిపారు. కార్పొరేషన్ పరిధిలో 25.90 కోట్లు వసూలు కావాల్సి ఉండగా, ఇప్పటికే 14.72 శాతం పన్నును వసూలు చేశామన్నారు. తమ టార్గెట్‌ను పూర్తి చేస్తామని వెల్లడించారు. ప్రజలు ఆస్తిపన్నును సకాలంలో చెల్లించి కార్పొరేషన్ అభివృద్ధికి సహకరించాలని కోరారు.

బియ్యం మార్కెటింగ్ కోసం ఒప్పందం



ఒప్పంద పత్రాలు మార్చుకుంటున్న అధికారులు

ఏజీవర్సిటీ: కర్ణాటకతో పాటు దేశంలోని పలు ప్రాంతాల్లో పండిస్తున్న తెలంగాణ సోనా ఆర్‌ఎన్‌ఆర్–15048 వరి రకం బియ్యం మార్కెటింగ్‌కు సంబంధించి కర్ణాటక (బళ్లారి) కి చెందిన మల్లికార్జున రైస్ ఇండస్ట్రీస్ సంస్థ, ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయంతో సోమవారం అవగాహన ఒప్పందం కుదుర్చుకుంది. ఈ ఒప్పందం రెండేళ్ల పాటు అమలులో ఉంటుందని విశ్వవిద్యాలయం అధికారులు తెలిపారు. ఒప్పంద ప్రత్రాలపై ఇండస్ట్రీస్ ప్రతినిధులు, విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్ సంతకాలు చేశారు. కార్యక్రమంలో పరిశోధన సంచాలకులు వెంకటరమణ, ఇంటర్నేషనల్ ప్రోగ్రామ్ డైరెక్టర్ డాక్టర్ జమునారాణి, వరి పరిశోధన సంస్థ శాస్త్రవేత్తలు పాల్గొన్నారు.

పాంక్రియాటిక్ కేన్సర్‌కు లాప్రోస్కోపిక్ శస్త్ర చికిత్స

కొండాపూర్ కిమ్స్ వైద్యుల ఘనత

గచ్చిబౌలి: కొండాపూర్ కిమ్స్ ఆస్పత్రిలో పాంక్రియాటిక్ కేన్సర్‌కు లాప్రోస్కోపిక్ శస్త్ర చికిత్స చేసినట్లు కన్సల్టెంట్ సర్జికల్ గ్యాస్ట్రోఎంటరాలజిస్టులు డాక్టర్ నవీన్, డాక్టర్ మధులిక తెలిపారు. ఖమ్మం జిల్లాకు చెందిన ఓ వ్యక్తి(49)కి పచ్చ కామెర్లు, బరువు తగ్గడం లాంటి సమస్యలతో చాలా ఆస్పత్రులకు వెళ్లి, చివరకు కొండాపూర్ కిమ్స్‌కు రాగా పరీక్షలు నిర్వహించి పాంక్రియాటిక్ క్యాన్సర్ ఉన్నట్లు నిర్ధారణ కావడంతో విపుల్స్ ప్రొసీజర్ లాప్రోస్కోపిక్ చికిత్స చేయాలని నిర్ణయించామని తెలిపారు. ఆరు గంటల పాటు శ్రమించిన డాక్టర్లు విజయవంతంగా పూర్తి చేశామన్నారు. రోగి త్వరగా కోలుకోవడంతో వారం రోజుల్లోనే డిశ్చార్జీ చేసి ఇంటికి పంపించామని పేర్కొన్నారు. ఓపెన్ శస్త్ర చికిత్సల కంటే ల్యాప్రోస్కోపిక్ శస్త్ర చికిత్సల వల్ల జీవన ప్రమాణం మెరుగ్గా ఉంటుందని డాక్టర్ నవీన్ తెలిపారు.

హెచ్‌సీయూ ప్రొఫెసర్లకు సెర్బ్–స్టార్





ప్రొ. చంద్రశేఖర్ ప్రొ.విజయకనవాడే

రాయదుర్గం: హైదరాబాద్ సెంట్రల్ యూనివర్శిటీకి చెందిన ఇద్దరు ప్రొఫెసర్లకు అరుదైన గౌరవం లభించింది. సెర్బ్ సైన్స్ అండ్ టెక్నాలజీ అవార్డు(సెర్బ్–స్టార్) వారికి లభించింది. హెచ్‌సీయూలోని స్కూల్ ఆఫ్ కెమిస్ట్రీ ప్రొఫెసర్ రాజదురై చంద్రశేఖర్, స్కూల్ ఆఫ్ ఫిజిక్స్‌లోని సెంటర్ ఆఫ్ ఎర్త్, ఓషన్ అండ్ అట్మాస్ఫియరిక్ సైన్సెస్‌లోని యూజీసీ అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ విజయకనవాడేకు అవార్డు లభించింది. పరిశోధన కోసం (సెర్బ్–స్టార్) సెర్బ్ ద్వారా స్థాపించబడింది.

ప్రజారోగ్య పరిరక్షణకే బస్తీ దవాఖానాలు



బస్తీ దవాఖానాలో పరీక్షలు చేయించుకుంటున్న ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్



హైదర్షాకోట్‌లో బస్తీ దవాఖానా ప్రారంభోత్సవంలో పాల్గొన్న ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్, మేయర్ మహేందర్‌గౌడ్ తదితరులు

బండ్లగూడ: పేద ప్రజల ఆరోగ్యాన్ని పరిరక్షించేందుకే ప్రభుత్వం బస్తీ దవాఖానాలను ఏర్పాటు చేసిందని రాజేంద్రనగర్ నియోజకవర్గ ఎమ్మెల్యే టి.ప్రకాష్‌గౌడ్ అన్నారు. బండ్లగూడ జాగీరు మున్సిపల్ కార్పొరేషన్ 4వ డివిజన్‌లోని హైదర్షాకోట్‌లో సోమవారం బస్తీ దవాఖానాను ఆయన బండ్లగూడ కార్పొరేషన్ మేయర్ మహేందర్‌గౌడ్‌తో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ బస్తీ ఆసుపత్రులతో సుస్తీకి ఇక స్వస్తి చెప్పాలన్నారు. బస్తీ దవాఖానాలు ప్రజల ఆరోగ్యానికి దోస్తీ దవాఖానాలు అయ్యాయన్నారు. ఈ ఆసుపత్రుల్లో 158 రకాల మందులు ఇచ్చి, 57 రకాల పరీక్షలు ఉచితంగా నిర్వహిస్తారన్నారు. త్వరలోనే 137 రకాల పరీక్షలు కూడా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. రోగాన్ని ప్రారంభంలోనే గుర్తించి మందులు వాడితే దీర్ఘకాలిక రోగాల బారిన పడకుండా ఉండవచ్చునని తెలిపారు. కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ పూలపల్లి రాజేందర్‌రెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ రాందాస్‌ముదిరాజ్, కమీషనర్ వేణుగోపాల్‌రెడ్డి, డిఎంఅండ్‌హెచ్‌ఓ, స్థానిక కార్పొరేటర్లు సాగర్‌గౌడ్, తలారి చంద్రశేఖర్, రవీందర్‌రెడ్డి, నాయకులు నాగరాజు, పాపయ్యయాదవ్, గోపాల్‌ముదిరాజ్, సుమన్‌గౌడ్, కట్టసాయిబాబా తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా బీరప్ప స్వామి జాతర



బోనాలతో వస్తున్న మహిళలు

రాజేంద్రనగర్: హైదర్‌గూడ ఎర్రబోడలో బీరప్ప స్వామి, కామారతి అమ్మవార్ల కల్యాణ మహోత్సవం సోమవారం ఘనంగా జరిగింది. దేవాలయ ఆవరణలోని ఆకుపచ్చ పందిరిలో ఒగ్గు పూజారుల ఆధ్వర్యంలో కల్యాణ మహోత్సవాన్ని నిర్వహించారు. రాజేంద్రనగర్ పరిసర ప్రాంతాలకు చెందిన వందలాది మంది భక్తులు కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా నిర్వహించిన బోనాల జాతర స్థానిక భక్తులను విశేషంగా ఆకట్టుకుంది. అత్తాపూర్ డివిజన్ పరిసర ప్రాంతాలకు చెందిన కురుమ సోదరులు ప్రతి ఇంటి నుంచి బోనాన్ని స్వామి వారికి నైవేద్యంగా తీసుకువచ్చారు. సోమవారం దేవాలయంలో జరిగిన పూజా కార్యక్రమాలకు రాజేంద్రనగర్ ఎమ్మెల్యే టి.ప్రకాష్‌గౌడ్, కార్పొరేటర్లు తోకల శ్రీనివాస్‌రెడ్డి, సంగీత గౌరీశంకర్‌తో పాటు వివిధ పార్టీలకు చెందిన ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు హాజరయ్యారు.

మానవతా విలువలు పాటించాలి



మానవత విలువల దినోత్సవంలో పాల్గొన్న అతిథులు, కార్మికులు

మణికొండ: గండిపేటలోని చైతన్య భారతి ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (సీబీఐటీ) కళాశాలలో సోమవారం ప్రపంచ మానవత విలువల దినోత్సవాన్ని నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన మైండ్ బీన్స్ ఇండియా వ్యవస్థాపకుడు, ఎండీ ఆదిరాజు రఘురాం మాట్లాడుతూ విలువలు అనుసరించటం ద్వారా మన ప్రతి అవసరం నెరవేరుతుందన్నారు. ఒత్తిడికి గురికాకుండా సమస్యలను ఎదుర్కొన్నప్పుడే లక్ష్యాలను ఛేదిస్తామన్నారు. కార్యక్రమంలో ప్రొఫెసర్ జగన్నాథరావు, ప్రొఫెసర్ సురేష్ బాబు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కళాశాలలో పని చేస్తున్న కార్మికులను సన్మానించారు.

రహదారులతోనే అభివృద్ధి

మణికొండ: కాలనీలు, బస్తీల్లో రహదారులతో అభివృద్ధి కనిపిస్తుందని, అవసరమైన అన్ని వీధుల్లో రోడ్ల నిర్మాణాన్ని చేపట్టి ఆదర్శ వార్డుగా తీర్చిదిద్దుతానని నార్సింగి మున్సిపాలిటీ 6వ వార్డు కౌన్సిలర్ పత్తి శ్రీకాంత్‌రావు అన్నారు. సోమవారం ఆయన తన వార్డులో రూ.50లక్షలతో నిర్మిస్తున్న సీసీ రోడ్డు పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రజలకు అవసర మైన అన్ని రకాల మౌలిక సదుపాయాలను కల్పించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. మున్సిపాలిటీలో నిధులు లభ్యతను బట్టి వార్డుల్లో అవసరమైన పనులు చేపడుతున్నామన్నారు. కార్యక్రమంలో బస్తీ వాసులు పాల్గొన్నారు.



సీసీ రోడ్డు పనులను ప్రారంభించిన కౌన్సిలర్ శ్రీకాంత్

అధికారుల నిర్లక్ష్యంతోనే పార్కులు కనుమరుగు



పార్కు స్థలాన్ని పరిశీలిస్తున్న కార్పొరేటర్ తోకల శ్రీనివాస్‌రెడ్డి

రాజేంద్రనగర్: ప్రభుత్వ అధికారుల నిర్లక్ష్యం కారణంగానే పార్కులు కబ్జాకు గురవుతున్నాయని మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ కార్పొరేటర్ తోకల శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. శాస్త్రీపురం డివిజన్‌లో ప్లే గ్రౌండ్ కబ్జాకు గురవుతుందని స్థానికులు ఫిర్యాదు చేయడంతో ఆయన సోమవారం స్థానిక నాయకులతో కలిసి సదరు స్థలాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా విలేకరులతో మట్లాడుతూ సుమారు 1.30 ఎకరాల పార్కు స్థలాన్ని కబ్జా చేసేందుకు ప్రయత్నిస్తున్నారన్నారు. కబ్జాదారులు ప్రహరీని కూల్చివేసినా అధికారులు పట్టించుకోవడం లేదన్నారు. బీఆర్‌ఎస్ నేతలు, స్థానిక ఎంఐఎం పార్టీతో కుమ్మక్కై పార్కు కబ్జాలకు పాల్పడుతున్నారన్నారు. పార్కు కబ్జా గురైందని ఫిర్యాదు అందినా ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్ స్పందించకపోవడంపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయన్నారు. వెంటనే ప్రహరీని నిర్మించి పార్కు స్థలం కబ్జా కాకుండా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో శాస్త్రీపురం డివిజన్ బీజేపీ అధ్యక్షులు ఏ.నిఖిల్‌కుమార్, జయబాబురావు యాదవ్, ప్రధాన కార్యదర్శి కె.గురుస్వామి, యువమోర్చా ప్రెసిడెంట్ ఆనంద్‌కుమార్, దర్శన్ యాదవ్, తోకల సుధాకర్‌రెడ్డి, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

వైఎస్ షర్మిలపై అక్రమ కేసులు దారుణం




సదాల శ్రీనివాస్‌రెడ్డి

రాజేంద్రనగర్: శాంతియుతంగా వినతిపత్రం అందించేందుకు వెళ్తున్న వైఎస్‌ఆర్‌టీపీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిలను రాష్ట్ర ప్రభుత్వం పథకం ప్రకారం అడ్డుకుని రెచ్చగొట్టిందని రాజేంద్రనగర్ నియోజకవర్గ పార్టీ యువజన విభాగం అధ్యక్షులు సదాల శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. సోమవారం సాయంత్రం శివరాంపల్లిలోని పార్టీ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ ప్రజల పక్షాన పోరాటం చేస్తున్న వైఎస్ షర్మిలను రాష్ట్ర ప్రభుత్వం వివిధ కారణాలతో గృహ నిర్బంధం చేస్తూ అడ్డుకుంటుందన్నారు. ప్రజల పక్షాన ఎలాంటి కార్యక్రమం చేపట్టినా అడ్డుకోవడం దారుణమన్నారు. ప్రజల కోసం ఒక మహిళా నాయకురాలు నిరంతర పోరాటం చేయడాన్ని జీర్ణించుకోలేక రాష్ట్ర ప్రభుత్వం కుట్ర పన్నుతుందన్నారు. గతంలో ఎన్నడూ వైఎస్ షర్మిల ఎవరి పట్ల అమర్యాదగా ప్రవర్తించలేదన్నారు. పోలీసులు రెచ్చగొట్టి డ్రైవర్‌పై చేయి చేసుకున్నారని, దానిని అడ్డుకునేందుకు ప్రయత్నించిన షర్మిలను పురుష పోలీసులు అడ్డుకున్నారన్నారు. దీంతో ఆమె ప్రతిఘటించిందే తప్ప దాడి చేయలేదన్నారు. ప్రజలు అన్నీ గమనిస్తున్నారని ప్రభుత్వానికి తగిన గుణపాఠం చెబుతారన్నారు.

ఆత్మీయ సమ్మేళనం

బండ్లగూడ: బండ్లగూడ జాగీరు మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని భాగ్యనగర్ కాలనీ హౌస్ ప్లాట్ ఓనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రెసిడెంట్ పి.సి.జి.చారి ఆధ్వర్యంలో కాలనీలో ఆత్మీయ సమ్మేళనాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో మేయర్ మహేందర్‌గౌడ్, కార్పొరేషన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు పూలపల్లి కృష్ణారెడ్డి, కార్పొరేటర్ పుష్పలత శ్రీనివాస్‌రెడ్డి, టింకురెడ్డి, అభిలాష్, గంధంగూడ మాజీ సర్పంచ్ ప్రకాష్, భాగ్యనగర్ కాలనీ వాసులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులను ఘనంగా సన్మానించారు. అందరూ కలిసికట్టుగా ఉంటూ కాలనీ అభివృద్ధి కోసం పాటుపడాలని సూచించారు. సమస్యల పరిష్కారం కోసం రాజీ లేకుండా ముందుకు సాగాలన్నారు. కార్యక్రమంలో వైస్ ప్రెసిడెంట్ అంజద్‌భాషా, ప్రధాన కార్యదర్శి వి.సురేందర్, జాయింట్ సెక్రటరీ లక్ష్మారెడ్డి, కోశాధికారి ఎం.జగన్, ఆర్గనైజింగ్ సెక్రటరీ వినోద్‌కుమార్, కల్చరల్ సెక్రటరీ సాయికిరణ్, కార్యవర్గ సభ్యులు, కాలనీ వాసులు పాల్గొన్నారు.



ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొన్న భాగ్యనగర్ కాలనీ హౌస్ ప్లాట్ ఓనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు

ఆత్మీయ సమ్మేళనాన్ని విజయవంతం చేయాలి

శంషాబాద్: రాజేంద్రనగర్ నియోజకవర్గ ఆత్మీయ సమ్మేళనాన్ని విజయవంతం చేయాలని నార్సింగి ఏఎంసీ చైర్మన్, బీఆర్‌ఎస్ పట్టణ అధ్యక్షుడు డి.వెంకటేష్‌గౌడ్ అన్నారు. మంగళవారం దుర్గానగర్‌లో నిర్వహించనున్న కార్యక్రమానికి పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున తరలిరావాలన్నారు. అదే రోజు బస్టాండ్‌లో నిర్వహించనున్న పార్టీ జెండావిష్కరణ కార్యక్రమాన్ని కూడా విజయవంతం చేయాలన్నారు. ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్ ఆధ్వర్యంలో బీఆర్‌ఎస్ తిరుగులేని శక్తిగా మారిందన్నారు. సందర్భంగా ఆయా కార్యక్రమాల ఏర్పాట్లపై సమీక్షించారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల పంపిణీ

శంషాబాద్ రూరల్: మండల పరిధిలోని వివిధ గ్రామాలకు చెందిన లబ్ధిదారులకు ఎమ్మెల్యే టి.ప్రకాష్‌గౌడ్ సోమవారం ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులను పంపిణీ చేశారు. అలీకోల్‌తండా వాసి కె.హోబియానాయక్, పెద్దషాపూర్‌కు చెందిన ప్రభాకర్, బుచ్చమ్మకు రూ.1,08,000 చెక్కులను అందజేశారు. కార్యక్రమంలో సర్పంచ్ చెక్కల చంద్రశేఖర్, ఉపసర్పంచ్ రాజునాయక్, నాయకులు మోహన్‌రావు, ఏమ్లానాయక్, సింహారెడ్డి, గోపాల్‌నాయక్, తదితరులు పాల్గొన్నారు.

లో ప్రెషర్ సమస్యను పరిష్కరించండి



జలమండలి జీఎం చంద్రశేఖర్‌కు వినతిపత్రం అందజేస్తున్న యాదగిరి

రాజేంద్రనగర్: మంచినీటి సరఫరాలో లో ప్రెషర్ కారణంగా అత్తాపూర్ వాసులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని బీఆర్‌ఎస్ పార్టీ సీనియర్ నాయకులు గుర్రంపల్లి యాదగిరి అన్నారు. ఈ మేరకు సమస్యను వెంటనే పరిష్కరించాలని కోరుతూ సోమవారం జలమండలి జీఎం చంద్రశేఖర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అత్తాపూర్ ఓల్డ్ గ్రామంలో సాయంత్రం వేళల్లో నీటిని సరఫరా చేస్తున్నారన్నారు. లో ప్రెషర్ కారణంగా నీళ్ల సరిపోక తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని ఈ టైమింగ్‌ను మార్చి సమస్యలను పరిష్కరించాలని వినతిపత్రంలో పేర్కొన్నామన్నారు. జలమండలి జీఎం చంద్రశేఖర్ సానుకూలంగా స్పందించారని సమస్య పరిష్కారం కోసం కృషి చేస్తానని హామీ ఇచ్చారన్నారు.

గుర్తుతెలియని యువకుడి ఆత్మహత్య



శంషాబాద్: ఎయిర్‌పోర్టు రోడ్డులో గుర్తుతెలియని యువకుడు ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన సోమవారం వెలుగులోకి వచ్చింది. పోలీసుల కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. విమానాశ్రయం ప్రధాన రహదారి ప్రధాన గేటుకు సమీపంలోని రెయిలింగ్‌కు గుర్తుతెలియని యువకుడు (30) కరెంటు వైరుతో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నట్లు గుర్తించిన ఎయిర్‌పోర్టు సిబ్బంది పోలీసులకు సమాచారం అందించారు. కరెంటు వైరుతో ఏటవాలుగా ఉన్న ప్రాంతంలో ఉరేసుకున్న తీరు అనుమానాస్పదంగా ఉన్నట్లు పేర్కొన్నారు. అతడి ఒంటిపై బూడిద రంగు ప్యాంట్, బనియన్ మాత్రమే ఉన్నాయి. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా ఆస్పత్రికి తరలించిన పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

వేసవి సెలవులను సద్వినియోగం చేసుకోవాలి



ప్రొగ్రెస్ రిపోర్టులను అందజేస్తున్న రామకృష్ణారెడ్డి

మణికొండ: వేసవి సెలవులను ప్రతి విద్యార్థి సద్వినియోగం చేసుకోవాలని మణికొండ మున్సిపాలిటీ బీఆర్‌ఎస్ ఫ్లోర్ లీడర్ కె. రామకృష్ణారెడ్డి అన్నారు. సోమవారం మణికొండ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో తల్లితండ్రుల సమావేశం నిర్వహించి విద్యార్థులకు ప్రొగ్రెస్ రిపోర్టులను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మణికొండ ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులు అవసరమైన సౌకర్యాలు సమకూర్చేందుకు కృషి చేస్తున్నామన్నారు. ఇప్పటికే నూతన పాఠశాల భవనంలో మౌలిక వసతులు కల్పించామన్నారు. విద్యార్థులు వాటిని సద్వినియోగం చేసుకుని చదువులో రాణించాలన్నారు. వేసవి సెలవుల్లో విద్యార్థులు క్రీడలు, ప్రత్యేక కోర్సులు నేర్చుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు మాంగ్యానాయక్, తల్లితండ్రులు పాల్గొన్నారు.

సమ్మె సమయంలో సంస్థకు సహకరించాలి



మాట్లాడుతున్న విద్యుత్ శాఖ అధికారులు

రాజేంద్రనగర్: విద్యుత్ సంస్థలో వివిధ సబ్ స్టేషన్లలో ఆపరేటర్లు, ఓఅండ్‌ఎం విభాగంలో పని చేస్తున్న హెచ్–82 ఆర్టిజన్స్ యూనియన్ ఉద్యోగులు ఈ నెల 25 నుంచి సమ్మెకు వెళ్తున్నట్లు టీఎస్‌పీడీసీఎల్ మేనేజ్‌మెంట్‌కు నోటీసు అందించారు. ఈ నేపథ్యంలో సోమవారం విద్యుత్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో రాజేంద్రనగర్ సర్కిల్ సూపరింటెండింగ్ ఇంజినీర్ ఎల్.గోపయ్య, డిఈ పి.రాజారాంరెడ్డి మాట్లాడుతూ విద్యుత్ వినియోగదారులు అందరు విషయాన్ని గమనించి సంస్థకు సహకరించాలన్నారు. విద్యుత్ సరఫరాలో ఏ విధమైన అంతరాయాలు ఉన్నా, ఎవరైనా విద్యుత్ సబ్‌స్టేషన్లు, ఊర్లో ట్రాన్స్‌ఫార్మర్లు, విద్యుత్ లైన్ల వద్ద సమస్యలు సృష్టించే చర్యలకు పాల్పడితే ఫోన్‌లో ఫొటోలు తీసి సంబంధిత అధికారులు, పోలీసులకు ఫిర్యాదు చేయాలన్నారు. ఈ నెల 25 నుంచి ఆర్టిజన్ కార్మికులపై ఎస్మా చట్టం అమల్లోకి వస్తుందన్నారు. సమ్మెకు వెళ్లే హెచ్–82 ఆర్టిజన్స్ సబ్‌స్టేషన్ ఆపరేటర్ల స్థానంలో ప్రత్యేక సిబ్బందిని నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేయడం జరిగిందన్నారు. ఈ విషయంలో విద్యుత్ వినియోగదారులు, వ్యాపారులు, రైతులు శాఖకు సహకరించాలని కోరారు.

కంటి వెలుగు కేంద్రాలను సద్వినియోగం చేసుకోండి





కంటి వెలుగు కేంద్రాన్ని ప్రారంభించి వైద్య సేవలను పరిశీలిస్తున్న మేయర్ మహేందర్‌గౌడ్, కార్పొరేటర్ అనితవెంకటేష్ తదితరులు

బండ్లగూడ: కంటి వెలుగు కేంద్రాల ద్వారా పేద ప్రజల కంటి సమస్యలకు శాశ్వత పరిష్కారాలు చూపిస్తున్నట్లు బండ్లగూడ జాగీరు మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ మహేందర్‌గౌడ్, కార్పొరేటర్ అనితవెంకటేష్ అన్నారు. సోమవారం కార్పొరేషన్ పరిధిలోని 21వ డివిజన్‌లో కంటి వెలుగు కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కంటి వెలుగు కేంద్రంలోని ఇబ్బందులను తదితర అంశాలపై తెలుసుకుని పరిష్కరిస్తున్నామన్నారు. ప్రజలకు మౌలిక వసతులను కల్పించామన్నారు. ప్రతి ఒక్కరికి అవగాహన కల్పించాలని, ఎలాంటి ఇబ్బందులు ఉన్నా తమ దృష్టికి తీసుకువస్తే పరిష్కరిస్తామన్నారు. ప్రతి ఒక్కరూ కంటి వెలుగు శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో గోపాల్ ముదిరాజ్, సయ్యద్ ఖాజా, రజాక్, శ్రీశైలంగౌడ్, కార్పొరేటర్ సాగర్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

డ్రైనేజీ పనులతో నీటి ఇక్కట్లు



మణికొండ గార్డన్‌లో పగిలిపోయిన నీటి సరఫరా పైప్‌లైన్లు

మణికొండ: డ్రైనేజీ పనుల్లో జాప్యం కారణంగా నీటి సమస్యను ఎదుర్కొంటున్నామని మణికొండ గార్డన్ కాలనీ వాసులు వాపోతున్నారు. మణికొండ మున్సిపాలిటీ పరిధిలోని మణికొండ గార్డన్‌లో ఇటీవల డ్రైనేజీ పనులను ప్రారంభించారు. వారం రోజుల్లో పూర్తి కావాల్సిన పనులు నెలలు గడుస్తున్నా ముందుకు సాగడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. డ్రైనేజీ తవ్వకాల కారణంగా పక్కనే ఉన్న మంచినీటి లైన్లు పూర్తిగా దెబ్బతిన్నాయని, దీంతో పలు వీధులకు నీటి సరఫరా నిలిచిపోయిందన్నారు. అసలే వేసవి కాలం, బోర్లు వట్టిపోవటం, రోడ్లపై తవ్వకాలతో ట్యాంకర్లు వచ్చే పరిస్థితి లేదన్నారు. తమ పరిస్థితిని అర్థం చేసుకుని అధికారులు డ్రైనేజీ పనులను యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయాలని వారు కోరుతున్నారు.